క్లుప్తంగా

తాచుపాము హల్‌చల్



అంబాజీపేటలో తాచుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో తాచుపాము హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గుండుబోగుల కొండ ఇంటి ఆవరణలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో రెండు రోజులుగా తాచుపాము ఉండిపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ తాచుపామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించారు. దానిని జన సంచారం లేని ప్రాంతంలో వదిలిపెట్టారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా 11 కేవీ సబ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై పనిచేసే ఇండస్ట్రియల్ ఫీడర్లతో పాటు పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు సంబంధించిన ఫీడర్లలోని వ్యాపార, గృహ సముదాయాలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధితులకు చేయూత



ఇబ్బందుల్లో ఉన్న సహచరులకు ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు నలుగురికి గురువారం రూ.1.50 లక్షల ఆర్థిక చేయూత అందించారు. 1989–90వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో సహచరులైన పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. సాయం అందించిన పూర్వ విద్యార్థులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో పాలూరి రాంబాబు, తాడి దలీల, అల్లూరు కిశోర్ వర్మ, వేగి లక్ష్మీనారాయణ, చొల్లంగి చక్రపాణి, మెండా ఆదినారాయణ, ఈలి మురళీకృష్ణ, చవ్వాకుల విద్యాసాగర్, నయినాల సత్య దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు

ఆలమూరు: పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలను పురస్కరించుకుని ఆలమూరులో పోలింగ్ కేంద్రాల వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్, స్త్రీశక్తి భవనం, మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను తహసీల్దార్ ప్రకాష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా పరిశీలించారు. వైద్యారోగ్య ప్రతినిధులు కె.శ్వేత, ఎం.సుమాంజలి, పి.జయమణి, ఎస్.సంధ్యారాణి, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు కె.సత్యనారాయణ, రామన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ రచనా రూపశిల్పి అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించిన న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు

రాజోలు: భారత రాజ్యాంగ రచనా రూపశిల్పిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీర్తి గడించారని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి అన్నారు. గురువారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు ఆవిష్కరించారు. అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, ఆకుల భాస్కరరావు, జాలెం భాస్కరావు, గంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



రాజోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటు వేసేందుకు క్యూలో..



పి.గన్నవరంలో..

ఓటెత్తిన చైతన్యం

- ప్రశాంతంగా మండలి ఎన్నికలు
- ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



ఓటు వేసి సిరా ముద్రను చూపుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

అయినవిల్లి/ అంబాజీపేట/ మామిడికుదురు/ రాజోలు/ రావులపాలెం/ కొత్తపేట/ ఆలమూరు/ పి.గన్నవరం: పట్టభద్రుల్లో చైతన్యం వచ్చింది.. మండలి ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధాన్ని సంధించారు.. క్యూలో నిలుచుని మరీ అత్యధిక శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎన్నికల నిర్వహణ తీరును అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ పరిశీలించారు. మండలంలో 2,514 మంది ఓటర్లకు 1,792 మంది ఓటు వినియోగించుకోగా 71.28 శాతం నమోదైందని తెలిపారు. అయినవిల్లి ఎస్సై కె.మనోహరజోషి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

• అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 74.4 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 210, 211 కేంద్రాల వద్ద పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. ఓటర్లు బారులు తీరి గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సై కె.చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. మామిడికుదురు మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,892 మంది ఓటర్లకు గాను 2,062 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 71 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు తెలిపారు. కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మామిడికుదురు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఆర్డీఓ కె.మాధవి మామిడికుదురు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

• పి.గన్నవరం మండలంలో 76.68 శాతం పోలింగ్ నమోదైంది. పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,582 మంది ఓటర్లకు 1,980 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాజోలు మండలంలో ఐదు, మలికిపురం మండలంలో నాలుగు, సఖినేటిపల్లి మండలంలో పోలింగ్ నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాజోలు నియోజకవర్గంలో మొత్తం 8,785 మంది ఓటర్లకు గాను 6,175 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని బూత్‌లో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ఓటు వేశారు. రాజోలు మండలంలో 70.41 శాతం, మలికిపురం మండలంలో 70.60 శాతం, సఖినేటిపల్లి మండలంలో 69.76 శాతం ఓటింగ్ నమోదైంది. సీఐ నరేష్‌కుమార్, ఎస్సై రాజేష్ కుమార్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపేట నియోజకవర్గంలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావులపాలెం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకేసారి పోలింగ్ కేంద్రానికి వచ్చిన సూర్యారావు, చిర్ల జగ్గిరెడ్డిలు విడివిడిగా ఓట్లు వేశారు. రావులపాలెం బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌లో సూర్యారావు, బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో జగ్గిరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం పోలింగ్ కేంద్రం బయట వారు మీడియాకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు సిరా ముద్రను చూపించారు. రావులపాలెం మండలానికి సంబంధించి జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లు, ఎంపీపీ మెయిన్ పాఠశాలలో మొత్తం ఐదు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 3,700 ఓటర్లు ఉండగా 2,573 ఓట్లు పోలయ్యాయి. 69.54 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ ముక్తేశ్వరరావు తెలిపారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో ఏడు మండలాల పరిధిలోని 27 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను ఆర్డీఓ పి.శ్రీకర్ పర్యవేక్షణలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు నిర్వహించారు. మొత్తం 73.60 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉంటే కొత్తపేట మండలంలో ఆరు కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 3,909 మంది ఓటర్లకు 2,831 మంది ఓటు వినియోగించుకోగా 72.42 శాతం నమోదైనట్లు తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై జీ సురేంద్ర, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలమూరులో 77.55 శాతం మేర పోలింగ్ జరిగింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, స్త్రీశక్తి భవనం, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎన్నికల అధికారులు (పీఓ) వి.శివరామ్ కుమార్, జీఎస్ఆర్ శాస్త్రి, కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 1960 మంది ఓటర్లు ఉండగా, 1,520 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఎస్సై ఎం.అశోక్, ఎంపీడీఓ రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మామిడికుదురులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అమలాపురం ఆర్డీఓ మాధవి



కొత్తపేట పంచాయతీలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్

మోతాదు మించొద్దు

- అధిక రసాయన ఎరువులతో అనర్థం
- భూసారానికి తీవ్ర నష్టం
- చీడపీడల వ్యాప్తికి దోహదం



పసుపల్లిలోని వరి చేలో ఎరువులు పిచికారీ చేస్తున్న రైతులు

అంబాజీపేట: అతి అన్నింటా అనర్థమే.. సాగులో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తే మొదటికే మోసమే.. అధిక దిగుబడి వస్తుందనే అపోహతో చాలామంది రైతులు ఎరువులను అధిక మొత్తంలో వాడడంతో భూముల సారం కోల్పోవడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తున్నాయి. ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకుని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు, పెట్టుబడి వ్యయం కూడా తగ్గించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. రబీ సాగులో ఎరువులు ముఖ్యంగా నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని, అధికంగా నత్రజని వాడటం వల్ల నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో 30,500 ఎకరాలు, పి.గన్నవరం నియోజకవర్గంలో 22,250, రాజోలు నియోజకవర్గంలో 13,650 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే మొదటి విడత ఎరువులు వేయడం పూర్తి చేసి, రెండో విడత ఎరువులు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. రైతులు ముఖ్యంగా వరి నాట్ల ఎదుగుదలకు అవసరమైన నత్రజనిని అందించే యూరియా ఎరువులను అధికంగా వాడుతున్నారు. చాలామంది రైతులు అవగాహన లోపంతో అవసరానికి మించి అధికంగా యూరియా వాడుతూ నష్టపోతున్నారు. నత్రజని ఎరువు అధికంగా వాడటంతో పంటలపై చీడపీడలు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంటుంది. తెగుళ్లు ఆశిస్తే రైతులు పురుగు మందులకు ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వరిలో కొన్నేళ్లుగా ఎండాకు తెగులు ఆశించడంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఇందుకు నత్రజని ఎరువుల అధిక వాడకమే కారణమని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు.

పరిమితి మించితే జరిగే నష్టాలివీ..

వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు వాడాలి. నత్రజని ఎరువుల అధిక వాడకంతో భూసారం దెబ్బతింటుంది. పంటలపై చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. పెట్టుబడులు పెరుగుతాయి. నీటి వినియోగం అధికమవుతోంది. పంట దిగుబడి తగ్గుతుంది. పంట నాణ్యత కోల్పోతుంది.

• పైరు త్వరగా ఎదిగి కొద్దిపాటి గాలికే పడిపోతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.

• ఎండాకు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



కొన్నేళ్లుగా రైతులు అవసరం మేరకే ఎరువులను వాడుతున్నారు. ఎరువుల అధిక వినియోగంతో కలిగే నష్టాలపై వారికి అవగాహన వచ్చింది. రబీ పైరుకు నత్రజని (యూరియా) ఎరువు సుమారు 80 కిలోలను మూడు సమ భాగాలుగా మూడు దఫాలుగా వేయాలి. సూపర్ సింగిల్ ఫాస్ఫేట్ 100 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలి. పొటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలి. యూరియాను వేసే ముందు నీటిని తీసివేసి, బురద పదునులో వేయాలి. 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. నత్రజనితో పాటు కలుపు మందులు కలపరాదు.

–సీహెచ్‌డీ విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, అంబాజీపేట

కక్షపూరితంగా ‘కూటమి’ రాజకీయాలు



ముసునూరి వెంకటేశ్వరరావు

కొత్తపేట: ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో ముందుకు వెళ్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మాజీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరి ఇష్టాలు వారివని, అందరూ ఒకే పార్టీకి పనిచేయరని అన్నారు. ఇందులో భాగంగానే తనకు నచ్చిన వైఎస్సార్ సీపీలో, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సినీ నటుడు పోసాని కృష్ణమురళి పనిచేశారని అన్నారు. గత ఎన్నికల అనంతరం ఆయన రాజకీయాల నుంచి దూరంగా వెళ్తున్నానని ప్రకటించారని, తరువాత ఎవరిపైనా విమర్శలు చేయలేదని, పైగా అనారోగ్యంతో ఉన్న పోసానిపై కక్షపూరితంగా కేసులు బనాయించి, దుర్మార్గంగా అరెస్టు చేసిన విధానం, కూటమి పాలకుల తీరు చూస్తుంటే ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇటువంటి చర్యలను మానుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మెజీషియన్ అలీకి అవార్డు



హైకోర్టు జడ్జి నంద నుంచి అవార్డు అందుకుంటున్న మెజీషియన్ అలీ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన మెజీషియన్ అలీ ప్రతిష్టాత్మకమైన సీనియర్ పీసీ సర్కారు మెమోరియల్ అవార్డును గురువారం అందుకున్నారు. ఇంటర్నేషనల్ మెజీషియన్స్ డేను పురస్కరించుకుని ఆర్‌కేస్ వండర్ వరల్డ్, తెలంగాణ మ్యాజిక్ అకాడమీ సంయుక్తంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్, కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సమావేశంలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరిపల్లి నంద, తెలంగాణ ప్రభుత్వ లాంగ్వేజ్ మరియు కల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అలీ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అలీని పలువురు అభినందించారు.

వినాయక స్వామికి ప్రత్యేక పూజలు



పలివెలలో ఉమా కొప్పేశ్వరస్వామికి త్రిశూల స్నానం చేస్తున్న పండితులు



కలవచర్లలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



మాచవరంలో యువ గణపతి

అంబాజీపేట: మాచవరంలో వేంచేసి ఉన్న శ్రీయువ గణపతి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి ఏకాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాచవరం పార్వతీ కందుల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద, అంబాజీపేట శివపురంలో అన్నసమారాధనలు జరిగాయి.

కలవచర్లలో అన్నసమారాధన

ఆలమూరు: కలవచర్లలో మహా శివరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఇక్కడి శివాలయం వద్ద గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ ఈ అన్నసమారాధనను ఏర్పాటు చేసింది. పరిసర ప్రాంతాల నుంచి సుమారు పది వేల మంది విచ్చేశారు. అనంతరం భక్తులు ఆలయాన్ని సందర్శించి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఏకాహం పూర్తయింది. ఆలమూరులో ఐదు రోజుల నుంచి జరుగుతున్న శ్రీవిక్రమ భట్టేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ కల్యాణోత్సవాలు ముగిశాయి.

ఉమా కొప్పేశ్వరస్వామికి త్రిశూల స్నానం

కొత్తపేట: పలివెల గ్రామంలో వేంచేసి ఉన్న ఉమా కొప్పేశ్వర స్వామివారికి త్రిశూల స్నానం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, పండితులు ఆలయంలో ఉత్సవ మూర్తులను మేళతాళాలతో పలివెల వంతెన వద్ద బొబ్బర్లంక – అమలాపురం ప్రధాన పంట కాలువ రేవులో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల తలపై త్రిశూలాన్ని ఉంచి స్నానం చేయించారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీఎం జీజీవీ రమణ తెలిపారు. ఉదయం 11:30 నుంచి 12:30 గంటల మధ్యలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు 99592 25549, 99592 25537 నంబర్లకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు తెలపాలన్నారు.